క్లుప్తంగా

ఓపెన్ స్కూల్, ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

హాలియా : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి పదో, ఇంటర్ ప్రవేశాల గడువు అపరాధ రుసుముతో ఆగస్టు 31వరకు గడువు పొడిగించారని హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రవేశాల కోసం టీసీ, కుల, ఆధార్, ఫొటోలు కావాలని, ఇంటర్ ప్రవేశాల కోసం టెన్త్ మెమో, టీసీ, కుల, ఆధార్, ఫొటోలతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు, విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నంబర్ 9010750686 లను సంప్రదించాలని కోరారు.

మహిళలపై వివక్ష విడనాడాలి

దేవరకొండ : ప్రస్తుత తరుణంలో మహిళలపై కొనసాగుతున్న వివక్షను విడనాడాలని దేవరకొండ మండలం మైనంపల్లి ఎంపీటీసీ కొర్ర గౌతమి అన్నారు. శనివారం మండల పరిధిలోని శక్రుతండా, బండమీది తండాల్లో సీడబ్ల్యూఎస్, గ్రామ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. రాజకీయాల్లో సైతం మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని ఆమె ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీత్యానాయక్, కొర్ర రాంసింగ్, సుమలత, రాము, ఉజ్వల, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరాన్ని జయప్రదం చేయాలి

హాలియా : హాలియా, నిడమనూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలోని అక్షయ స్కూల్‌లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని లయన్స్ క్లబ్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరం నల్లగొండకు చెందిన ఐకాన్, హైదరాబాద్ ఉమెన్స్ అండ్ ఫెర్టిలిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యశిబిరంలో హైదరాబాద్‌కు చెందిన గైనకాజిస్టు డాక్టర్ చేకూరి స్వప్న, ఐకాన్ ఆస్పత్రికి చెందిన డాక్టర్లు కోడే శశాంకా, రవిశంకర్ కన్నా, మైసిసింద్రా, చెరుకూరి సాయి మౌనిక, కడిమి సాయి లావణ్య, రాజేంద్రప్రసాద్, సాయి కుమార్ గౌడ్ పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్‌గా ప్రమోషన్

పెద్దవూర : మండల నాయబ్ తహసీల్దార్ కట్టా వెంకట రంగారెడ్డికి తహసీల్దార్‌గా ప్రమోషన్ వచ్చింది. గతంలో ఆయన పెద్దవూర రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గాను, ప్రస్తుతం నాయబ్ తహసీల్దార్‌గాను పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నాయబ్ తహసీల్దార్‌లను తహసీల్దార్‌లుగా పదోన్నతి కల్పించింది. దీంతో వెంకట రంగారెడ్డికి తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈయనను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేసింది. వరుసగా సెలవులు ఉండటంతో ఇంకా ఏ మండలానికి కేటాయించలేదు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గంలో అర్హులైన దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతేగాకుండా ఇంటి స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 15నుంచి 25వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పొట్ట ఇద్దయ్య, కొండ్రపల్లి రమేష్, శేఖర్, సురేష్, సాయిలు, ధానయ్య, లక్ష్మణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్లను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : సూపర్ లగ్జరీ బస్సుల్లో ఏర్పాటు చేసిన వాటర్ బాటిళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీపో మేనేజర్ బొల్లేద్దు పాల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు అదనంగా మరో రూ.10 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ప్రయాణికులు తన దాహార్తిని తీర్చుకోవడానికి మార్గ మధ్యలో బస్సులు ఆపుకోని నీటి ఇబ్బందులు పడాల్సి అవసరం లేకుండా పోయిందన్నారు. ఆ బస్సుల్లో 5వేల బాటిళ్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఆర్టీసీ సంస్థ అమలు చేస్తుందన్నారు.

వీరయ్య మృతి తీరని లోటు

మిర్యాలగూడ టౌన్ : యాదవ సంఘం మాజీ అధ్యక్షులు నాగనబోయిన వీరయ్య యాదవ్ మృతి యాదవులకు తీరని లోటని పలువురు నాయకులు అన్నారు. శనివారం వీరయ్య యాదవ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహించారని అన్నారు. ఆయన మృతి యాదవులకు తీరని లోటన్నారు. నిడమనూరు మండలం నారమ్మ గూడెంలో అంత్యక్రియలు జరుగుతాయని యాదవులు భారీగా తరలిరావాలని పిలుపు నిచ్చారు.

నత్తనడకన ఇళ్ల క్రమబద్ధీకరణ!

- తహసీల్దార్ల బదిలీలతో దరఖాస్తుల విచారణలో జాప్యం
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న దరఖాస్తుదారులు


హిల్‌కాలనీలో విచారణ చేస్తున్న త్రిపురారం తహసీల్దార్ వజ్రాల జయశ్రీ

నాగార్జునసాగర్ : నంది కొండ మున్సిపాలిటీలో ఇళ్ల క్రమబద్ధీకరణకు జీఓ నంబర్ 58, 59 కింద చేసుకున్న దరఖాస్తుల విచారణ నత్తనడకన సాగుతోంది. దరఖాస్తుల విచారణకు కేటాయించిన తహసీల్దార్లు బదిలీ కావడంతో విచారణ ఆగింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ రెండేళ్ల సర్వీస్ నిండి సొంత జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీ చేయాలని ఆదేశించింది. దీంతో కలెక్టర్‌తో పాటు తహసీల్దారులంతా బదిలీ అయ్యారు. అప్పటి వరకు ముమ్మరంగా సాగిన దరఖాస్తుల విచారణ ఆగింది.

బదిలీల నేపథ్యంలో..

నందికొండలో 58జీఓ కింద 943మంది దరఖాస్తు చేసుకోగా, 59జీఓ ప్రకారం 1388 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్లు బదిలీ కావడంతో నందికొండలో దరఖాస్తుల విచారణ నిలిచిపోయింది. కలెక్టర్ బదిలీ కావడంతో డిమాండ్ నోటీసులు పంపడం కూడా ఆగింది. మిర్యాలగూడ ఆర్డీఓతో పాటు, పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం, తిరుమలగిరి(సాగర్) మండలాల తహసీల్దార్లను విచారణకు నందికొండకు వేశారు. 58జీఓ కింద 520 దరఖాస్తులను విచారణ చేశారు. ఇందులో 419 దరఖాస్తుల సమాచారాన్ని కలెక్టర్ లాగిన్‌కు అప్లోడ్ చేశారు. మిగతా 524మందివి విచారణ ఆగింది.

59జీఓ కింద 850 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి కలెక్టర్ లాగిన్‌లో పంపినట్లు సమాచారం. ఇందులో 40మందికి నోటీసులు కూడా జారీ చేశారు. 10మంది పూర్తి స్థాయిలో అమౌంట్ కట్టి ముగ్గురు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. 809 దరఖాస్తులు కలెక్టర్ దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఒక దరఖాస్తును ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. 59 జీఓ కింద 538 మంది దరఖాస్తుల విచారణ ఆగింది. పెద్దవూర, అనుముల మండలాలకు ఇప్పటి వరకు తహసీల్దారులు నియామకం కాలేదు. రెండు రోజులుగా త్రిపురారం మండల తహసీల్దార్ వజ్రాల జయశ్రీ 30మంది దరఖాస్తులను విచారణ చేసినట్లు తెలిపారు.

క్రమబద్ధీకరణ ఇలా..

58జీఓ ప్రకారం 120గజాల వరకు ఇళ్లు ఉంటే ఎలాంటి రుసుము లేకుండా పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుంది. అంతకు మించి స్థలాలు ఉన్న వారి కోసం 59జీఓను జారీ చేసింది. దీని ప్రకారం మార్కెట్ రేటును నిర్ణయించి ప్రభుత్వం డిమాండ్ నోటీసు పంపుతుంది. మూడో విడతలలో నిర్ణయించిన రేటును చలానా ద్వారా చెల్లించాలి. ఒకేసారి చెల్లిస్తే 5శాతం రిబేట్ ఇస్తున్నారు. 120గజాలనుంచి 200గజాలు ఉంటే మార్కెట్ ధరలో 25శాతం, 201నుండి300గజాలు ఉంటే 50శాతం, 301నుండి 500 గజాలవరకు 75శాతం, ఆపై స్థలాలకు 100శాతం ధర చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన చలానా ను ఆ మండల తహసీల్దార్ అప్పగిస్తే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నామినల్ రిజిస్ట్రేషన్ ఫీజుతో రిజిస్ట్రేషన్ చేస్తారు.

దరఖాస్తుదారులు ఆందోళన చెందొద్దు

దరఖాస్తుదారులు ఎవరూ ఆందోళన చెందొద్దు తహసీల్దార్లు బదిలీపై వచ్చి విధుల్లో చేరగానే వెంటనే విచారణ చేపడుతాం. వారం రోజుల్లో పూర్తి చేస్తాం. మీ ఇంటి ముందుకు వచ్చి వివరాలు సేకరిస్తారు. ఎవరూ పైరవీకారులను ఆశ్రయించొద్దు.

– చెన్నయ్య, ఆర్డీఓ, మిర్యాలగూడ

విచారణ పూర్తి చేయాలి

త్వరలో దరఖాస్తు విచారణను పూర్తి చేయాలి. 59జీఓ ప్రకారం చెల్లించాల్సిన నగదు డిమాండ్ నోటీసులు పంపాలి. దీంతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. లబ్ధిదారులకు ఆందోళన ఉండదు. కొంతమందికి డిమాండ్ నోటీసులు వచ్చి మరికొంత మందికి రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



– పగడాల నాగరాజు, దరఖాస్తుదారుడు

పేదలకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి


గుర్రంపోడు : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

గుర్రంపోడు : తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో 13మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. అనంతరం పోచంపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు పూల సత్యనారాయణ తండ్రి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్ గౌడ్, స్థానిక సర్పంచ్ షేక్ మస్రత్ సయ్యద్‌మియా, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రావులపాటి భాస్కర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బల్గూరి నగేష్‌గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గుండెబోయిన కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు ఎరుకల రేణుశ్రీ రామలింగం, షాహిన్ మదార్‌షా, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ లాలయ్య, అచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎన్‌టీపీఏ యాదగిరికి నివాళి


యాదగిరి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భగత్, తదితరులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పైలాన్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఎన్‌టీపీఏ ఆవుల యాదగిరి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పైలాన్ కాలనీలోని ఆయన నివాసానికి శనివారం తీసుకురావడంతో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్ స్థానిక నాయకులతో కలిసి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నందికొండ, హాలియా మున్సిపల్ చైర్మన్లు కర్ణఅనూషా శరత్‌రెడ్డి, వెంపటి పార్వతమ్మ శంకరయ్య, టీఎస్‌జీటీఎస్ సాగర్ యూనిట్ అధ్యక్షులు జానపాటి రాములు, బీఆర్‌ఎస్ పార్టీ టౌన్ కార్యదర్శి భూషరాజుకృష్ణయ్య, యూత్ అధ్యక్షులు రాహూల్‌యాదవ్, చంద్రయ్య ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి


దేవరకొండ : ధర్నాలో మాట్లాడుతున్న రామస్వామి

దేవరకొండ : రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. శనివారం రెండో ఏఎన్‌ఎంలు దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నాకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. గత 16ఏళ్లుగా రెండో ఏఎన్‌ఎంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు సేవ, చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు వైద్యం అందించే ఏఎన్‌ఎంల సేవలను ప్రభుత్వం గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, నీలా వెంకటయ్య, మల్లయ్య, పోలె రత్నకుమారి, సాలమ్మ, శోభారాణి, శారద, చంద్రకళ, రుక్సానా, వెంకటమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ అర్బన్: వంటా వార్పు కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఏఐటీయూసీ నాయకులు

ఏఎన్‌ఎంల వంటా వార్పు

మిర్యాలగూడ అర్బన్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారం రోజులుగా ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో వంటా వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఎండీ.సయ్యద్ మాట్లాడుతూ.. రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, ఇప్పుడు వేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లింగానాయక్, జి.యాదగిరి, ఏఎన్‌ఎం యూనియన్ డివిజన్ అధ్యక్షురాలు సరిత, పద్మ, మమత, లలిత, నాగలక్ష్మి, సైదమ్మ, సమత, నిర్మల, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, నాగమణి, పార్వతి తదితరులున్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ అప్రజాస్వామికం

దేవరకొండ : బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ అప్రజాస్వామికమని ఆ పార్టీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర కృష్ణ అన్నారు. అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన మౌనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల పక్షాన గ్రూప్–2ను పోస్ట్‌ఫోన్ చేయాలని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షను అడ్డుకొని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం తగదన్నారు. తెలంగాణ సమాజం రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏకుల రాజారా వు, ప్రకాష్, లలిత, మొగులయ్య, ఇమ్రాన్, జాన్, తరుణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

కొండమల్లేపల్లి : గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ చేపట్టిన సత్యాగ్రహ దీక్ష నేపథ్యంలో శనివారం పలువురు బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు గ్యార యాదగిరి మాట్లాడారు. అరెస్టయిన వారిలో బీఎస్పీ నాయకులు కూర శ్రీకాంత్, పి.అనిల్, గ్యార సామేల్ తదితరులున్నారు.


దేరకొండ : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

చింతపల్లి : బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముదిగొండ మొగిలయ్య మాట్లాడుతూ ఆరు లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతుంటే ప్రజాస్వామ్య బద్ధంగా సత్యాగ్రహ దీక్షకు పిలుపునిచ్చినా బహుజన సమాజ్ కార్యకర్తలను రాత్రికిరాత్రే అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. గ్రూప్–2విద్యార్థుల పక్షాన నిలబడిన ఏకైక నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్, సైదులు, గిరి, తరుణ్, శ్రీకాంత్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.


హాలియాలో మాట్లాడుతున్న ఆదిమల్ల వెంకటేశ్

ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ అమానుషం

హాలియా : గ్రూపు–2 పరీక్షలను తక్షణమే వాయిదా వేయాలని సత్యాగ్రహ దీక్షకు పిలుపునిచ్చిన బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హౌస్ అరెస్టు చేయడం అమానుషమని ఆ పార్టీ నాగార్జున సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమల్ల వెంకటేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు తంగెళ్ల సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధానకార్యదర్శి ముదిగొండ వెంకటేశ్వర్లు, మహిళా కన్వీనర్ బైరాగి విజయ, పెద్దవూర, అనుముల మండలాల అధ్యక్షులు కుక్కమూడి ముత్యాలు, జిల్లా మధు, ఎల్లేష్ ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి


హాలియాలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆకారపు నరేష్

హాలియా : సెప్టెంబర్ 2,3,4వ తేదీల్లో హాలియా పట్టణంలోని నిర్వహించే ఎస్ఎఫ్ఐ 44వ నల్లగొండ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో మహాసభల కరపత్రాలను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి మతోన్మాద భావాలు జొప్పిస్తూ దేశ విశ్వ విద్యాయాల్లో అభ్యుదయ భావజాలంపై దాడులను పెంచుతుందన్నారు. శాస్త్రీయ విద్యావిధాన్ని వక్రీకరిస్తూ విద్యార్థులకు ఒక్కటి పురాణాలు వల్లించి వారి మెదడులను మొద్దుబారిచే విధంగా అవలంబిస్తుందని ఆరోపించారు. పోరాటాలకు పుట్టినిల్లుయిన హాలియాలో వచ్చే నెల 2,3,4వ తేదీల్లో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు 250మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లపై చర్చించి భవిష్యత్‌లో చేపట్టబోయే పోరాటాల కార్యాచరణను మహాసభలో రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘం నాయకులు అవుతా సైదులు, కొండేటి శ్రీను, వెంకన్న, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్ల బాలు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీశ్, కోరే రమేష్, చందు, నవీన్, బ్రహ్మం, మధు, రాహుల్ ఉన్నారు.

పెద్దవూరలో భారీ వర్షం


రహదారిపై నిలిచిన వర్షం నీరు

పెద్దవూర : మండల కేంద్రంతో పాటు మండలంలో శనివారం మధ్యాహ్నం గంటన్నరకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో మండల కేంద్రంలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ఇరుకు వంతెన సమీపంలో రోడ్డుపై పెద్ద గుంత పడింది. రెండు అడుగుల మేర వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డంతా వర్షం నీరు నిలిచిపోవడంతో గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు గుంతలో పడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

లచ్చిరాం నాయక్‌కు నివాళి

హాలియా : అనుముల మండలంలోని వీర్లగడ్డ గ్రామానికి చెందిన దేవావత్ లచ్చిరాం నాయక్ (జీహెచ్‌ఎంసీ ఏఈఈ) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శనివారం వీర్లగడ్డ తండాలో వేర్వేరుగా బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా లచ్చిరాం నాయక్ మృతదేహంపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండలం లోని కొరివేనిగూడెం, హజారిగూడెం గ్రామాల్లో గుండెపోటుతో మృతి చెందిన తుమ్మురుగొట్టి నాగేశ్వరరావు, జానపాటి సైదులు కుటుంబ సభ్యులను బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నోముల భగత్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో అనుముల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, మాజీ మార్కెట్ చైర్మన్ బాబురావు నాయక్, సర్పంచ్‌లు వద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సంధ్యారాము, మేరేడి వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు జబీస్‌జలీల్ పాషా, సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలునాయక్, రావుల శ్రీను, చంద్రమౌళి, మనాది శేఖర్ యాదవ్, పురుషోత్తం యాదవ్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, సీత నాగరాజు, శివ, కాశయ్య, తిరుపతి, రాంబాబు, వహాబ్, రామయ్య, పున్నయ్య ఉన్నారు.

పుస్తక పఠనంతో మేధాశక్తి

మిర్యాలగూడ టౌన్ : పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాచమళ్ల శ్రీను అన్నారు. శనివారం పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ పాఠకుల దినోత్సవం సందర్భంగా భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాచమళ్ల శ్రీను, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భిక్షమయ్యలు మాట్లాడుతూ గ్రంథాలయాలు అంటేనే పుస్తకాల ఘని అని, ప్రతి విద్యార్థి గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల ద్వారా అనేక మంది మేధాశక్తిని పెంచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


రంగనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

కొనసాగుతున్న రిలే దీక్షలు

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పులిచర్ల మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం మండల సాధన సమితి చైర్మన్ దేవసాని శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రకుంటతండాలో మండల ఏర్పాటు ఆవశ్యకతపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. రిలే దీక్షలో పాల్గొనాలని, భవిష్యత్ కార్యచరణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ముత్యంరెడ్డి, వెంకటయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమరశీల ఉద్యమ రథసారథి ఏఐఎస్‌ఎఫ్


ఏఐఎస్‌ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు

దేవరకొండ : సమరశీల ఉద్యమ రథసారథి ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవరకొండ పట్టణంలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ గతంలో చేసిన పోరాట స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలకు విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటాలు నిర్వహించిందని ఆయన గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి అర్జున్, శంషోద్దీన్, శైలజ, శివ, సిద్ధార్థ, బాబు, పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని హిల్‌కాలనీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శోభన్‌బాబు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్‌కు ఎంతో సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర మండల నాయకులు అంజి, అఖిల్, రమేశ్, సిద్దు, సుమన్, కార్తీక్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిండి : విద్యారంగా సమస్యల పరిష్కారానికై ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు సురగి వినయ్ కుమార్ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ వేడులకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఎదురుగా ఆ సంఘం జెండాను ఆయన ఎగుర వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ము కాస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ ం విద్యారంగ సమస్యలను గాలికొదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కనకాచారి,మండల సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్, ఆ సంఘం నాయకులు స్వామి, రాజేందర్, శివ, సాయికిరణ్, ప్రవీణ్, భాను, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


గుర్తింపు కార్డులను అందజేస్తున్న ఎస్ఐ

కొండమల్లేపల్లి : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు కోరారు. శనివారం కొండమల్లేపల్లి మండల ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూనియన్ అధ్యక్షుడిగా గాధగోని వెంకన్న, ఉపాధ్యక్షుడిగా రమావత్ రవి, కోశాధికారిగా రాము, గిరి, అంజయ్య, వెంకటయ్య, మహేశ్, ఎన్నికయ్యారు.

విలేకరులపై దాడి

వేములపల్లి : మండల కేంద్రం శివారులో విలేకరులకు ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ కేటాయించిన స్థలాన్ని చదును చేసుకుంటున్న వారిపై కొందరు దాడి చేశారు. ఈ సంఘటన వేములపల్లి శివారులో శనివారం చోటుచేసుకుంది. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన విలేకరుల ఇళ్ల కోసం గ్రామ శివారు లోని సర్వే నెం.652లోగల 1.20ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ కేటాయించారు. విలేకరులు కొన్ని రోజులుగా ఆ స్థలాన్ని జేసీబీ సాయంతో చదును చేయిస్తున్నారు. ఈ క్రమంలో మండలానికి చెందిన కొందరు వ్యక్తులు శనివారం అక్కడ పనులు చేస్తున్న విలేకరులపై దాడి చేశారు. దీనిపై విలేకరులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం డీఎస్పీ వెంకటగిరిని కలిసి రక్షణ కల్పించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విలేకరులు కోరారు. దళిత విలేకరులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ మిర్యాలగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విలేకరులు వేములపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేపట్టారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న విలేకరులు

మంత్రి తలసానిని కలిసిన ఏకే ఫౌండేషన్ చైర్మన్

హాలియా : రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఏకే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కట్టెబోయిన అనిల్‌కుమార్ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాగర్ నియోజకవర్గంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యక్రమాల బ్లూ ప్రింట్‌కాపీని అనిల్‌కుమార్ మంత్రికి అందజేశారు. ఏకే ఫౌండేషన్ ద్వారా సాగర్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు, నిరుద్యోగ యువతీ, యువకులు, వికలాంగులు, నిరుపేద కుటుంబాలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి అనిల్‌కుమార్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు, యువత మాదగోని మల్లికార్జున్ గౌడ్, అర్జున్, నరేష్, వెంకట్, మన్నెం కోటి, మోహన్ చారి తదితరులు ఉన్నారు.


మంత్రి శ్రీనివాస్ యాదవ్‌కు బ్లూ ప్రింట్ కాపీని అందజేస్తున్న అనిల్‌కుమార్